

రంజాన్ వేళలు

ఇఫ్తార్ - సోమవారం
సాయంత్రం - 6.32
సహర్ - మంగళవారం
ఉదయం - 5.00

వైభవంగా మల్లన్న కల్యాణం


బోనాలతో ఆలయానికి తరలి వెళుతున్న మహిళలు



మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో ఆదివారం మల్లన్న స్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో తరలివెళ్ల నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతల మధ్య బోనాలు, తొట్టెల ఊరేగింపు నిర్వహించారు.

షాబాద్, మార్చి 17


క్యాంప్ కార్యాలయంలో అనుచరులతో ఎంపీ రంజిత్‌రెడ్డి

అటా.. ఇటా? అని అనుకున్నట్టుగానే చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి చివరకు హస్తం వైపే మొగ్గు చూపారు. బీఆర్‌ఎస్‌లోనే కొనసాగాలా? లేక కాంగ్రెస్‌లో చేరాలా? అని కొన్ని రోజులుగా సంకోచించిన ఆయన కాంగ్రెస్‌కే జై కొట్టారు. ఆదివారం నగరంలో సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఆయనకే దక్కుతుందనే చర్చా సాగుతోంది. కాగా ఆయన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు రాజీనామా లేఖ పంపారు. సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇదిలా ఉంటే ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్‌ను ఖాళీ చేసి రెండు లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పావులు కదుపుతోంది. కారు పార్టీ ప్రజాప్రతినిధులను, సీనియర్ నాయకులను పార్టీలో చేర్చుకుంటోంది.

బీఆర్‌ఎస్‌కు రంజిత్‌రెడ్డి గుడ్‌బై!



- మొయినాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ నేతలతో భేటీ
- కారు పార్టీని ఖాళీ చేయడమే కాంగ్రెస్ ధ్యేయం
- లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పావులు
- పార్టీ వీడుతున్న నేతలతో బీఆర్‌ఎస్ సతమతం

పార్టీకి రాజీనామా వెంటనే కాంగ్రెస్‌లో చేరిక


సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మార్చి 17 : పార్లమెంట్ ఎన్నికల వేళ ఉమ్మడి జిల్లాలో రాజకీయాలు ఊహించని విధంగా మలుపులు తిరుగుతున్నాయి. ఎప్పుడు ఎవరు ఏ పార్టీలోకి జంప్ అవుతారో తెలియడం లేదు. 'సొంత పార్టీలోనే కొనసాగుతా.' అని చెప్పిన నేతలు గంటల్లోనే కండువాలు మార్చుతున్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ అధికారం కోల్పోయినప్పటి నుంచి వరుస షాక్‌లతో ఆ పార్టీ కోలుకోలేకపోతోంది. ఇప్పటికే ఎంతో మంది కీలక నేతలు పార్టీ మారారు. ఒక్కొక్కరుగా పార్టీకి దూరమవుతున్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ను ఖాళీ చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పావులు కదుపుతోంది. ఉమ్మడి జిల్లాలో బలమైన నేతలైన ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా ఇపుడు చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి సైతం అనూహ్యంగా బీఆర్‌ఎస్‌కు రాంరాం చెప్పి హస్తం గూటికి చేరారు. అంతేకాదు పాలక పార్టీ కండువా కప్పుకున్న కొద్ది గంటలకే ఆయన మొయినాబాద్‌లో కాంగ్రెస్ నేతలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. వాస్తవానికి కొద్ది రోజులుగా ఆయన కాంగ్రెస్‌లో చేరతారని జోరుగా ప్రచారం జరుగుతున్నా ఆయన బయటపడలేదు. ఆదివారం అకస్మాత్తుగా బీఆర్‌ఎస్ చీఫ్ కేసీఆర్‌కు రాజీనామా లేఖను పంపారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంతకు ముందు తన రాజీనామా విషయాన్ని ప్రజలకు సోషల్ మీడియా వేదికగా తెలియజేశారు. 'ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో నేను బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నాను. ఇంత కాలం నాకు పార్టీలో సహకరించిన అందరికీ ధన్యవాదాలు. ఇన్ని రోజులు చేవెళ్ల ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన కేసీఆర్, కేటీఆర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు.' అని తన సందేశంలో పేర్కొన్నారు. తన రాజీనామాను ఆమోదించాలని గులాబీ అధినేతను కోరారు. ఇదిలా ఉంటే రంజిత్‌రెడ్డితో పాటు మరి కొందరు నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, యాదయ్య ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. అలాగే మాజీ మంత్రి మల్లారెడ్డి ఇటీవలే బెంగళూరు వెళ్లి కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో భేటీ అయ్యారు.

క్యాంప్ కార్యాలయంలో రంజిత్‌రెడ్డి సుధీర్ఘ మంతనాలు

మొయినాబాద్ రూరల్: చేవెళ్ల బీఆర్‌ఎస్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన నేపథ్యంలో మండల పరిధి ఎన్కేపల్లిలో గల క్యాంప్ కార్యాలయంలో తన అనుచరులతో ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు సుదీర్ఘ మంతనాలు జరిపారు. ఈ సందర్భంగా చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే మనందరి లక్ష్యం అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పార్టీ టికెట్ తనకు వస్తుందని, తానే మళ్లీ చేవెళ్ల ఎంపీగా గెలవడం ఖాయమన్నారు. ఎంపీ సీటు నుంచి పోటీచేయడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి పూర్తి వివరాలు వెల్లడిస్తానని ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి ఆంధ్రజ్యోతికి వెల్లడించారు. కాంగ్రెస్‌లో చేరిన రంజిత్‌రెడ్డికి ఆయన అనుచరులు, స్థానిక నాయకులు, కార్యాకర్తలు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు మేలు జరుగుతుందనే తాను కాంగ్రెస్‌లో చేరానని రంజిత్‌రెడ్డి అన్నారు. కాగా క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశమేమీ నిర్వహించలేదు. చర్చల్లో నాయకులు డి.ఆంజనేయులు, మహేందర్‌రెడ్డి, బాల్‌రాజ్, పలు మండలాల బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ శ్రేణులు రంజిత్‌రెడ్డి కార్యాలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చి మద్దతు ప్రకటించాయి.


మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

పేదల సంక్షేమానికి సీపీఐ పోరాటం

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- శంషాబాద్‌లో సీపీఐ జిల్లాస్థాయి రాజకీయ శిక్షణా తరగతులు

శంషాబాద్, మార్చి 17 : భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) పేదలు, రైతులు, కార్మికుల సంక్షేమం కొరకు పోరాటం చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో రెండు రోజుల పాటు జరిగిన సీపీఐ జిల్లాస్థాయి రాజకీయ శిక్షణా తరగతులు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి సాంబశివరావు ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. పేదలకు ఇళ్ల స్థలాలు, సాగు భూముల కోసం పోరాడే పార్టీ సీపీఐ అని అన్నారు. తమ పార్టీ ప్రజల సంక్షేమం తప్పా.. ఇంకేమీ ఆశించడం లేదని అన్నారు. ఏమైనా ఆశించి ఉంటే ఇప్పటివరకు మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులం అయ్యుండేవాళ్లమని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం కోసం తమ ఆస్తులు, ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన మహానుభావులెందరో సీపీఐలో ఉన్నారని ఆయన గుర్తుచేశారు.

కుప్పకూలిన బీఆర్‌ఎస్ పార్టీ

బీఆర్‌ఎస్, ఆ పార్టీ నిర్మించుకున్న భవనం పేకమేడల కంటే తొందరగా కుప్పకూలిపోయిందని, వాటి శిథిలాలు కూడా దొరక్కుండా పోయాయని కూనంనేని అన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా గెలిచే అవకాశం లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి బీఆర్‌ఎస్ అభ్యర్థులందరూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మాట వినకుండా పారిపోతున్నారని. అధికారంలో ఉన్నన్నాళ్లు బీఆర్‌ఎస్ నాయకులు బెదిరింపులకు పాల్పడ్డారని అన్నారు. ఇప్పుడు ఆ బెదిరింపులే వారికి ఎదురై బీఆర్‌ఎస్ కొంపముంచుతున్నాయని అన్నారు. సీపీఐ రాష్ట్ర నాయకుడు శంకర్‌నారాయణ, జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీంద్రాచారి, పుస్తకాల నర్సింగ్‌రావు, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, యాదిరెడ్డి, సయ్యద్ అఫ్సర్, ఊరుగంటి యాదయ్య, నర్రా గిరి, కె.రామస్వామి, శేఖర్‌రెడ్డి, ప్రభులింగం, బి.జంగయ్య, ఎం. శ్రీను, పి.లక్ష్మణ్, నీలమ్మ, కిషోర్ ఆర్.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ సందడి!

- రంగారెడ్డికి నుంచి ఇద్దరు నేతలను వరించిన అదృష్టం
- డీసీసీ అధ్యక్షుడికి పట్టణ మౌలిక సదుపాయాల ఆర్థిక సంస్థ 'చైర్మన్'
- మల్‌రెడ్డి రాంరెడ్డికి రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పదవి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్), మార్చి 17 : తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ లోకసభ ఎన్నికలపై గురిపెట్టింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టుల భర్తీకి పార్టీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేసిన నాయకులకు ప్రభుత్వం నామినేటెడ్ పదవులను కట్టబెడుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు దక్కని నేతలకు ఈ పదవులను కట్టబెట్టింది. రంగారెడ్డి జిల్లాలో ఇద్దరు నేతలను ఈ అదృష్టం వరించింది. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి పట్టణ మౌళిక సదుపాయాల ఆర్థిక సంస్థ చైర్మన్ పదవి దక్కింది. అలాగే మల్‌రెడ్డి రాంరెడ్డికి రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి దక్కింది. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించారు. జిల్లెలగూడ ఉప సర్పంచ్‌గా, సర్పంచ్‌గా, సరూర్‌నగర్ జడ్పీటీసీగా, యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. తర్వాత పీసీసీ సెక్రటరీగా తొమిదేళ్ల సేవలందించారు. కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు పనిచేశారు. ప్రస్తుతం డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయనకు పట్టణ మౌలిక సదుపాయాల ఆర్థిక సంస్థ చైర్మన్ పదవి దక్కడంతో ఆయన పార్టీ అధిష్టానానికి, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా గురునాథ్‌రెడ్డి

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పించింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కృషిచేసిన నాయకులకు ప్రభుత్వం రాష్ట్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవులను కట్టబెట్టింది. ఈ క్రమంలో కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి గెలుపునకు విశేష కృషి చేసిన గురునాథ్ రెడ్డికి పోలీసు గృహ నిర్మాణ సంస్థ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆదివారం గురునాథ్‌రెడ్డి ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గురునాథ్‌రెడ్డి రాజకీయ జీవితం కాంగ్రెస్ పార్టీతో ప్రారంభమైంది. కొడంగల్ ఎమ్మెల్యేగా ఐదు సార్లు గెల్చారు. సర్పంచ్ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎంపీపీ, ఎమ్మెల్యే స్థాయికి ఎదిగారు. 1992లో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. ఈ సారి ఆయనను పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ చేశారు. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, ప్యాక్స్ చైర్మన్ కటకం శివకుమార్‌గుప్తా, లయన్స్ క్లబ్ సభ్యులు దాసప్పయాదవ్, మురారి వశిష్ఠ, రమేశ్, జయతీర్థచారి తదితరులు గురునాథ్‌రెడ్డిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.


గురునాథ్‌రెడ్డి
కాల్వ సుజాత
చల్లా నర్సింహారెడ్డి

కాల్వ సుజాతకు సముచిత స్థానం

తాండూరు నియోజకవర్గానికి రెండోసారి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవి దక్కింది. తాండూరు పట్టణానికి చెందిన కాల్వ సుజాతను రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఇంతకు ముందు తాండూరుకే చెందిన ఏఐసీసీ సభ్యుడు మల్కూడ్ రమేష్‌కు రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా నియామకమయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం పదేళ్లుగా పార్టీకి పనిచేసిన వారిని గుర్తించి పలు కార్పొరేషన్లకు నామినేటెడ్ పదవులను కట్టబెట్టింది. ఇదిలా ఉంటే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉన్న కె.సుజాత ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె టికెట్ ఆశించారు.. కానీ కొన్ని సమీకరణాల వల్ల పార్టీ ఆమెకు టికెట్ ఇవ్వలేకపోయింది. అయితే పార్టీ గెలుపు కోసం ఆమె జిల్లా వ్యాప్తంగా ప్రచారంలో పాల్గొన్నారు. పార్టీకి సుజాత అందజేస్తున్న సేవలను గుర్తించి అధిష్ఠానం అమెను ప్రభుత్వ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమించింది.

నేటి నుంచి పది పరీక్షలు

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

- 239 కేంద్రాల్లో పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 50,946 మంది విద్యార్థులు
- 5 నిమిషాల వరకు ఆలస్యానికి అనుమతి

ఉన్నత పాఠశాలలు	986
హాజరు కానున్న విద్యార్థుల సంఖ్య	50,946
ఒకసారి ఫెయిలై పరీక్ష రాస్తున్న విద్యార్థులు	1,012
మొత్తం పరీక్షా కేంద్రాలు	239
స్టోరేజీ పాయింట్ల సంఖ్య : (పోలీస్ స్టేషన్లు)	37
ఇన్విజిలేటర్లు	2,420
రూట్ ఆఫీసర్లు	10
ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు	09

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్), మార్చి 17 : నేటి (సోమవారం) నుంచి తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఈ సారి నిమిషం నిబంధనను ఎత్తివేయగా.. 5 నిమిషాల గ్రేస్ టైమ్ పీరియడ్ ఇచ్చారు. అంటే పరీక్ష కేంద్రానికి విద్యార్థులు ఐదు నిమిషలు ఆలస్యంగా వచ్చినా అనుమతించనున్నారు. పదో తరగతి పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేలా కలెక్టర్ శశాంక చర్యలు తీసుకుంటున్నారు. ఆయన ఆదేశాల మేరకు జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు ఆధ్వర్యంలో సీఎస్, డీవోఎస్‌లకు శిక్షణ ఇచ్చారు. జిల్లాలో మొత్తం 986 పాఠశాలల నుంచి 50,946 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అలాగే 1,012 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందుకోసం 239 రెగ్యులర్ సెంటర్స్‌ను ఏర్పాటు చేశారు. అలాగే మరో 10 సెంటర్లను ప్రైవేట్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేశారు. 10 రూట్లలో ప్రశ్నపత్రాలను సరఫరా చేసి 37 పోలీస్ స్టేషన్లలో భద్రపర్చారు. పరీక్షలకు సంబంధించి ప్రతీ సెంటర్‌లో ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ అధికారి, 2,420 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నారు. 12 మంది ఫ్లయింగ్ స్క్వాడ్స్, 239 సెంటర్లకుగాను ప్రతీ సెంటర్‌లో ఒక సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు. హాల్‌టికెట్ అందని విద్యార్థులుంటే.. ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని పరీక్ష రాయవచ్చు. పరీక్ష సమయాలను దృష్టిలో పెట్టుకొని బస్సులను సకాలంలో నడిపించేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పరీక్ష కేంద్రానికి ఉదయం 8.30 గంటల లోపు చేరుకునే విధంగా విద్యార్థులు సిద్ధంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. 9.35 గంటల వరకు సెంటర్‌లోకి అనుమతిస్తారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. జిరాక్స్ సెంటర్లు మూసివేయనున్నారు. పరీక్షలు పూర్తయ్యే వరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఏ రకమైన ఇబ్బందులు తలెత్తినా కంట్రోల్ రూమ్ రూమ్ ఫోన్ నెంబర్ 8019236220లో సంప్రదించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు.


ఆమనగల్లులో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి



పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి. అందరూ మంచి మార్కులతో పాస్ కావాలి. ఏమైనా సమస్యలుంటే కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయవచ్చు. సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి.

\- సుశీందర్‌రావు, డీఈవో

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలి


కుర్మిద్దలో ఆర్మ్‌డ్ ప్రొటెక్షన్ ఫోర్స్ కవాతు

యాచారం, మార్చి 17 : పౌరులందరూ స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ సీఐ నర్సింహారావు అన్నారు. ఆదివారం సాయంత్రం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుర్మిద్ద, మీర్‌ఖాన్‌పేట, ఆకులమైలారం గ్రామాల్లో ఆర్మ్‌డ్ ప్రొటెక్షన్ ఫోర్స్‌తో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేట్లు ప్రతీ ఒక్కరు పోలీసులకు సహకరించాలని కోరారు. ఓటర్లను డబ్బు, మద్యం పేరుతో మభ్యపెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లోకసభ ఎన్నికలు ముగిసే వరకూ..
ప్రజావాణి రద్దు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్) : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు రద్దు చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక తెలిపారు. వాస్తవానికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోడ్ గత ఫిబ్రవరి 26 నుంచే అమల్లోకి వచ్చిన సందర్భంగా ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయబడిందని గుర్తుచేశారు. ప్రస్తుతం తాజాగా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన దృష్ట్యా, ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు ప్రజావాణి కార్యక్రమం ఉండదన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రజావాణి తిరిగి కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయుడికి అరుదైన అవకాశం

● ఎస్సీఈఆర్టీకి ఎండీ యాసీన్ ఎంపిక


ఎండీ యాసీన్

వికారాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వికారాబాద్ జిల్లా ఉపాధ్యాయుడికి అరుదైన అవకాశం లభించింది. బషీరాబాద్ జడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎండీ యాసీన్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్సీఈఆర్టీ)లో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించేందుకు ఎంపికయ్యారు. రాష్ట్ర విద్యా విభాగాన్ని బలోపేతం చేసేందుకు ఎస్సీఈఆర్టీలో ఫ్యాకల్టీగా డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించేందుకు ఆయా సబ్జెక్టుల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా, 28 పోస్టులకు అన్ని జిల్లాల నుంచి భారీ సంఖ్యలో ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. మూడంచెల ఎంపిక ప్రక్రియలో జిల్లాకు చెందిన ఎండీ యాసీన్ ఎంపికయ్యారు. శనివారం ఆయన ఎస్సీఈఆర్టీలో ఫ్యాకల్టీగా విధుల్లో చేరారు. రెండేళ్ల పాటు ఆయన డిప్యూటేషన్‌పై అక్కడ కొనసాగనున్నారు. పనితీరు ఆధారంగా మరో ఏడాది డిప్యూటేషన్‌ను పొడిగించే అవకాశం ఉంటుంది. ఎస్సీఈఆర్టీలో ఫ్యాకల్టీగా ఎంపికైన యాసీన్‌ను సహచర ఉపాధ్యాయులు, అధ్యాపకులు అభినందనలతో ముంచెత్తారు.

మల్లన్న కల్యాణోత్సవానికి ఆహ్వానం


సుధీర్‌రెడ్డికి ఆహ్వానపత్రాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మేడ్చల్‌టౌన్, మార్చి 17 : మేడ్చల్ పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్ మల్లన్న స్వామి కల్యాణోత్సవ వేడుకల్లో పాల్గొనాలని పలువురు స్థానిక కాంగ్రెస్ నేతలు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ఆదివారం వినతిపత్రాన్ని అందజేశారు. మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్ చాపరాజు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పలువురు కాంగ్రెస్ నేతలు సుధీర్‌రెడ్డిని కలిసి ఆహ్వానించారు.

నేడు పాంబండపై
కొబ్బరి కాయల విక్రయానికి వేలం

కులకచర్ల, మార్చి 17: మండలంలోని పాంబండ బండవెల్కిచర్ల గ్రామ పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి పెద్ద జాతర సందర్భంగా కొబ్బరి కాయల విక్రయానికి సోమవారం వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నర్సమ్మ రాములు, ఈవో సుధాకర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.2వేలు డిపాజిట్ చేయాలని, వేలంలో దక్కించుకున్న వారు సాయంత్రంలోపు పూర్తి డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈనెల 30 నుంచి ఏప్రిల్ 10 వరకు ఆలయం ఆవరణలో కొబ్బరి కాయల విక్రయానికి అవకాశం ఉంటుందన్నారు.

నేడు కాంగ్రెస్‌లో చేరనున్న బీఆర్ఎస్ నేతలు

మేడ్చల్ టౌన్, మార్చి 17 : మేడ్చల్ మాజీ సర్పంచ్ చిలుక రాజు తనయుడు, మున్సిపల్ కౌన్సిలర్ రామన్నగారి మణికంఠగౌడ్ సోమవారం 500మందితో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. మేడ్చల్ మున్సిపల్ పాలకవర్గంలో చిన్న వయసు ఉన్న మణికంఠకు స్థానికుంగా యువకుల్లో మంచిపట్టు ఉంది. దీంతో ఆయన తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. పట్టణంలోని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్‌ల సమక్షంలో పార్టీలో చేరుతున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున్న సభను నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

రంజిత్‌రెడ్డి వందల ఎకరాలు పోగేశారు

● బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్

చేవెళ్ల, మార్చి17: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాన్ని వ్యాపార కేంద్రంగా మలుచుకుని, రియల్ ఎస్టేట్ బ్రోకర్లను దగ్గర పెట్టుకుని ఎంపీ రంజిత్‌రెడ్డి వందల ఎకరాలు పోగేసి బీఆర్‌ఎస్ పార్టీని నాశనం చేశారని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ ఆరోపించారు. ఆదివారం చేవెళ్లలో ఆయన ప్రతిక ప్రకటన విడుదల చేశారు. రంజిత్‌రెడ్డి అడ్రస్ లేని వ్యక్తి అని, చేవెళ్ల ఎంపీగా గెలిపిస్తే ప్రజాసేవ చేయకుండా మండలాల వారీగా వందల ఎకరాల భూములు సమకూర్చుకున్నారని విమర్శించారు. చేవెళ్ల అభివృద్ధికి ఎంపీగా ఆయన చేసిందేమీ లేదన్నారు. తన ఆస్తులను కాపాడుకునేందుకు అధికారకాంగ్రెస్ పార్టీలో చేరారని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఆయనకు బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు.

యథేచ్ఛగా సుద్ద తరలింపు!

తాండూరు మీదుగా అక్రమ రవాణా

● కర్ణాటక నుంచి మారేపల్లిలో డంపింగ్
● విదేశాలకు ఎగుమతికి కాకినాడ పోర్టుకు తరలింపు
● వారం రోజుల్లో 10వేల టన్నులు తరలిన సుద్ద

తాండూరు, మార్చి 17: కర్ణాటక నుంచి తాండూరు మీదుగా కొన్ని రోజులు అక్రమంగా పుల్లర్ ఎర్త్ మినరల్(ఖనిజ సంపద) రాయల్టీ, జీఎస్టీ లేకుండా పెద్దఎత్తున తరలిపోతోంది. ప్రస్తుతం పెద్దేముల్ మండలం మారేపల్లి ప్రాంతంలో సుద్ద తవ్వకాలు నిలిచిపోయాయి. అయితే ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర రాయల్టీని వర్తింపజేసి కాకినాడ పోర్ట్ ద్వారా విదేశాలకు ఎగుమతి చేయాలని ప్రయత్నిస్తున్నారు. కర్ణాటకలో సుద్ద ఎగుమతులకు లీజులు ఇవ్వడం నిలిపివేసి కర్ణాటక, తాండూరు మైన్స్ అధికారులతో సంబంధిత కంపెనీలు కుమ్మక్కై, తెలంగాణ రాయల్టీని వాడుకున్నారు. కర్ణాటకలోని కల్‌బుర్గి జిల్లాకల్గీతాలుకా కొడ్లి గ్రామంలో కొఫియా మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ చట్ట విరుద్ధంగా తవ్వకాలు జరిపి తరలించిన సుద్దను పెద్దేముల్ మండలం మారేపల్లిలో నిల్వపెట్టి కాకినాడ తరలించారని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా(మార్కిస్ట్) నాయకులు రాత పూర్వకంగా అధికారులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై కర్ణాటక, తెలంగాణ రాష్ట్రం తాండూరు మైనింగ్ శాఖకు విచారణకు ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు నిర్ణయించారు. అటు కర్ణాటక సబ్ మినరల్ రూల్స్ 1994 ప్రకారం ఖనిజాలను అక్రమ రవాణా చేసిన కాఫియా మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీపై చర్యలు తీసుకోవాలంటూ కమ్యూనిస్టు నేతలు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా కర్ణాటక ఖనిజ సంపదకు తెలంగాణ రాష్ట్రం తాండూరు నుంచి రాయల్టీ ఇవ్వడంపై తప్పుపట్టారు. వారం రోజులుగాసుమారు 10వేల మెట్రిక్ టన్నుల సుద్దను తరలించడానికి మైన్స్ అధికారులు సహకరించారని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే పెద్దేముల్ మండలం మారేపల్లి నుంచి పేరుమోసిన ప్రభుత్వ కంపెనీ పుల్లర్స్ ఎర్త్‌ను దొంగిలించారని మనీ లాండరింగ్ ఇతర అక్రమ లావాదేవీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. కర్ణాటక నుంచి తాండూరు మీదుగా మారేపల్లికి తరలిస్తున్న సుద్దను ఆపి తనిఖీలు చేయకుండా అటు సరిహద్దు కర్ణాటక చెక్‌పోస్టు, ఇటు తాండూరు చెక్ పోస్టు మైన్స్‌అధికారులు సంబంధిత కంపెనీతో లోపాయికారి ఒప్పందం చేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



సరిహద్దు కర్ణాటకలో సుద్ద తవ్వకాలు

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

● వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్, మార్చి 17: జిల్లాలో పార్లమెంటు ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా రాజకీయ ప్రజా ప్రతినిధులు సహకరించాలని వికారాబాద్ వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ కోరారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఎన్నికల నియామవళి అమలు, విధివిధానాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆదివారం అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీ ప్రతినిధులు ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు సహకరించాలన్నారు. పార్టీలు గానీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, పార్టీలు గానీ అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేసి ఎన్నికల నిబంధనల ఉల్లంఘనకు పాల్పడకూడదని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక సౌకర్యాలను సమకూర్చుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో వికారాబాద్ డిప్యూటీ తహసీల్దార్ రాజేందర్, బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్, సీపీఎం ప్రతినిధులతో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం

కడ్తాల్, మార్చి17 : లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఘన విజయం సాధిస్తుందని జడ్పీటీసీ జర్పులదశరథ్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్,సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, వైస్‌ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్ అన్నారు. బీఆర్‌ఎస్‌ను దెబ్బతీసేందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు సాగిస్తున్న ఎత్తుగడలను ప్రజలు తిప్పికొట్టక తప్పదన్నారు. కడ్తాల మండల బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం బీఎస్పీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు. నాగర్‌కర్నూల్‌లో ఆయన ఘన విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ నియంత పాలనను కొనసాగిస్తోందని మండిపడ్డారు. దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకొని నీచరాజకీయాలకు, బెదిరింపులకు ఒడిగట్టిందని ఆరోపించారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యుడు బాచిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు జోగు వీరయ్య, ఎంపీటీసీలు బొప్పిడి గోపాల్, లచ్చిరామ్ నాయక్, ప్రియ రమేశ్, నర్సింహ్మాగౌడ్, నరేశ్, బీఎస్పీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్ యాదవ్, ఉన్నారు.



ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జడ్పీటీసీ దశరథ్, బీఆర్‌ఎస్ నాయకులు

పవర్ లేని ప్రత్యేకాధికారులు!

● చెక్ పవర్ లేక తప్పని ఇబ్బందులు
● అస్తవ్యస్తంగా పంచాయతీ పాలన

బషీరాబాద్, మార్చి 17: గ్రామపంచాయతీల్లో ప్రత్యేధికారుల పాలన ప్రారంభమై 40దాటినా సంబంధిత అధికారులకు చెక్‌పవర్ కల్పించలేదు. దీంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన అస్తవ్యస్తంగా మారింది. పంచాయతీల నిర్వహణ, ప్రజాసమస్యల పరిష్కారంలో ఇబ్బందులు తప్పడంలేదు. ఫలితంగా గ్రామాల్లో అత్యవసర సమస్యల పరిష్కారానికి కార్యదర్శులు ఆర్థిక భారాన్ని భరించాల్సివస్తోందని చెబుతున్నారు. గతంలో సర్పంచులు సొంతంగా డబ్బులు ఖర్చు చేసి ఆ తర్వాత బిల్లులు పెట్టుకునేవారు. ఇప్పుడు ప్రత్యేకాధికారులు తమసొంత ఖర్చు చేయడానికి ముందుకు వచ్చే పరిస్థితి లేదు. దీంతో సమస్యలు తీరడంలేదు. పంచాయతీల్లో ఉన్న అరకొర నిధులనూ వినియోగించుకోవడానికీ అవకాశం లేకపోవడంతో పంచాయతీలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చినపక్పటికీ చెక్‌పవర్ కల్పిచడంలో జాప్యం జరుగుతోంది. పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారుల పేరిట ఖాతాలు ఏర్పాటు చేసుకోకపోవడానికి డిజిటల్ కీ పొందే ప్రక్రియ కొలిక్కి రాలేదని తెలిసింది. ఈ పరిస్థితుల్లో పంచాయతీలకు జమచేసిన నిధులు చెక్కుల రూపంలో పొందాలంటే విధిగా డిజిటల్ కీ అవసరమవుతుందని అధికారులు అంటున్నారు. ఒక్కో గెజిటెడ్ అధికారికి మూడు నుంచి నాలుగు పంచాయతీల ఇన్‌చార్జి బాధ్యతలు ఉండటంతో బ్యాంకులో అడ్డంకిగా మారుతున్నట్లు తెలుస్తోంది. బషీరాబాద్‌లో 36 గ్రామ పంచాయతీలు ఉండగా ఆరుగురు గెజిటెడ్ అధికారులకు ప్రత్యేకాధికారులుగా బాధ్యతలిచ్చారు. వీరు గ్రామపంచాయతీలను సందర్శిస్తున్నా నిధులులేక ఏంచేయలేని దుస్థితిలో అలా వెళ్లి ఇలా వస్తున్నారు.




ప్రభుత్వం వెంటనే చెక్‌పవర్ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పాలనకు ఆటంకం

ప్రతినెలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 15వ ఆర్థిక సంఘం నిధుల కింద ఎస్ఎఫ్‌సీ, జనరల్ ఫండ్ నిధులను మంజూరు చేయగా వాటిని సర్పంచులు, ఉపసర్పంచులు వారి చెక్‌పవర్ ద్వారా అవసరాల మేరకు వినియోగించేవారు.ప్రస్తుతం ఆ అధికారాలను ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, బ్లీచింగ్ పౌడర్, తాగునీటి పైప్‌లైన్ లీకేజీలు, వీధిదీపాల నిర్వహణకు చెల్లింపులు చేయలేకపోతున్నామని పలువురు కార్యదర్శులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. విద్యుత్ బిల్లుల చెల్లింపులు, పంచాయతీ కార్మికుల వేతనాలు, ట్రాక్టర్ల కిస్తీలు కట్టడం ఇబ్బందిగా మారడంతో సతమతమవుతున్నారు. ఇదిలాఉండగా ప్రత్యేకాధికారుల పాలనలో పంచాయతీల్లో పలు సమస్యలు పేరుకుపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

జోరుగా అక్రమ నిర్మాణాలు

» మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండి
» సెల్లార్, సెట్ బ్యాక్‌పై నిర్లక్ష్య ధోరణి
» అనుమతులు లేకుండానే ఐదేసి అంతస్థుల నిర్మాణాలు



తాండూరు-కొడంగల్‌మార్గంలో దుకాణాల నిర్మాణం

తాండూరు, మార్చి17: తాండూరులో అనుమతులు లేకుండా అంతస్తుల మీద అంతస్తులు కట్టేస్తున్నారు. మూడంతస్తుల భవనానికి అనుమతులు పొంది ఐదంతస్తుల వరకు నిర్మాణాలు చేపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమార్కులను ప్రోత్సహిస్తుండటంతో మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. నాలాలను, ప్రభుత్వ స్థలాలు, పార్కులను కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు కనిపించడంలేదా? అని, మున్సిపాలిటీ అధికారుల మౌనం వెనుక అంతర్యమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం అలసత్వంతోనే తాండూరు పట్టణంలో అక్రమ నిర్మాణాలు వందల సంఖ్యలో కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. స్థానికులు, ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేసినా ఏమాత్రం పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తక్కువ స్థలంలో భారీ బిల్డింగ్‌లు, సెట్ బ్యాక్, పార్కింగ్ స్థలం లేకుండానే ఫంక్షన్‌లు, పెద్దపెద్ద భవంతుల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. భవన నిబంధనలను పట్టించుకోకుండా పట్టణ శివారులోని కొడంగల్ రోడ్డులో ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగగానే నాలా పక్కనే రెండో ఫ్లోర్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈనిర్మాణాన్ని కూల్చి వేయక పోతే పలు కాలనీలు ముంపునకు గురయ్యే అవకాశముందని పలువురు అంటున్నారు. పట్టణ నడిబొడ్డు ప్రాంతమైన శాంతినగర్ కాలనీలో నిర్మిస్తున్న ఆస్పత్రికి మూడంతస్తుల నిర్మాణానికి అనుమతులు పొంది ఐదంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. శాంతినగర్ పార్కు పక్కన మరో ఆస్పత్రి భవనమూ నిబంధనలకు విరుద్ధంగానే నిర్మితమవుతోంది. ఇలాంటి భవనాలు తాండూరులోవందల సంఖ్యలో నిర్మిస్తున్నారు.

నోటీసులిచ్చి చర్యలు తీసుకుంటాం

అక్రమ నిర్మాణ దారులకు నోటీసులు ఇచ్చాం. సరైన డాక్యుమెంట్లు, అనుమతులు లేకుంటే చర్యలు తీసుకుంటాం. ఇంటి నిర్మాణం, కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణాలు, రేకుల షెడ్లు వేసే వారు సైతం నిబంధనల మేరకు ఆన్‌లైన్ ద్వారా అనుమతులు పొందాలి. అక్రమ నిర్మాణాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం.

విక్రమ సింహారెడ్డి, తాండూరు
పురపాలక సంఘం కమిషనర్



ఇందిరాచౌక్‌లో అనుమతి లేకుండా నిర్మాణాలు

చేవెళ్ల అభివృద్ధి కోసమే రాజకీయల్లోకి

● బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల, మార్చి 17 : చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉన్న గ్రామాల అభివృద్ధి కోసమే రాజకీయల్లోకి వచ్చానని, ఎన్నికల్లో గెలిచినా, ఓడినా తాను ప్రజల మధ్యే ఉంటానని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బీజేపీ చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గస్థాయి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని చేవెళ్ల పట్టణ కేంద్రంలోని సీహెచ్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం, పలువురు సీనియర్ నేతలతో కలిసి విశ్వేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల గడ్డపై కాషాయ జెండా ఎగరవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దేశంలో మరోసారి ఏర్పడబోయేది బీజేపీ ప్రభుత్వమే అని అన్నారు. చేవెళ్ల పరిధిలో ఉన్న భూ కబ్జాదారులు, అవినీతిపరులు ఒక్కటై పోటీకి వచ్చినా ఓటర్లు బీజేపీ వైపే ఉన్నారని చెప్పారు.అంతకుముందు మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం మాట్లాడుతూ చేవెళ్ల ప్రాంతానికి ఏం అభివృద్ధి చేశారని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఓట్లు అడగడానికి వస్తున్నారని విమర్శించారు. వారికి ఓట్లు వేయొవద్దని ప్రజలకు సూచించారు. విశ్వేశ్వర్‌రెడ్డి ఎంపీగా గెలిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు అంజన్‌కుమార్‌గౌడ్, కంజర్ల ప్రకాశ్, మల్లారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నర్సింహరెడ్డి, జిల్లా నాయకులు రమణారెడ్డి, తొండ రవి, కుంచం శ్రీనివాస్‌గుప్తా, నాగర్జున్‌రెడ్డి, జంగం శివానందం, మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, తదితరులు ఉన్నారు. కాగా శంకర్‌పల్లి మండలంలోని జన్వాడ గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు రాములుగౌడ్, మాజీ ఎంపీపీ. బీర్ల నర్సింలు, నాయకులు ఉన్నారు.

సన్మార్గంతోనే దైవానుగ్రహం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, మార్చి17: సన్మార్గంతోనే దైవానుగ్రహం పొందవచ్చని, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అవ్వాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగే వారు ఆనందమయ జీవనాన్ని గడుపుతారని ఆయన చెప్పారు. తలకొండపల్లి మండలం దేవుని పడకల్ గ్రామంలో ఈనెల 24 నుంచి ప్రారంభమయ్యే శ్రీ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రాలు, వాల్‌పోస్టర్లను స్థానిక నాయకులతో కలిసి హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన ఆలయాల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తుందని చెప్పారు.బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని మాజీ సర్పంచ్ శ్రీశైలం ఆదివారం ఎస్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్‌కు ఆహ్వాన పత్రికలను అందజేశారు. సత్యం, శంకర్, బిక్షపతి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మేధాశక్తిని పెంపొందించుకోవాలి : ఎమ్మెల్యే వీర్లపల్లి



సైన్స్‌ఫెయిర్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్, మార్చి 17 : విద్యార్థులు మేధాశక్తిని పెంచుకుని, సత్తాను చాటుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని శ్రీ వెంకటరమణ పాఠశాలలో శనివారం జరిగిన సైన్స్‌ఫేర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఏర్పాటు చేసిన పలు ఎగ్జిబిట్లను ఆయన పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వీరమోని హేమదేవేందర్, వీరమోని దేవేందర్, ప్రిన్సిపాల్ విన్సన్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా, కొడిచర్ల ఎంపీటీసీ బి. రవీందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరగా ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతేకాకుండా కొత్తూరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్గీయ రాజీవ్‌గాంధీ మెమోరియల్ క్రికెట్‌టోర్నీని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు జె. సుదర్శన్‌గౌడ్, జనిగె జగన్, నాయకులు జంగ నరింహా, కుమారస్వామిగౌడ్, ఇందూరి శ్రీనివాస్, గోవింద్ నాయక్, కర్రోల్ల సురేందర్, నవీన్‌చారి, అంజినాయక్, తేజేశ్వర్, పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు

కీసర, మార్చి 17: తహసీల్దార్ కార్యాలయంలో అవినీతికి పాల్పడినా, లంచాలు డిమాండ్ చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కీసర తహసీల్దార్ అశోక్ హెచ్చరించారు. బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సీఎంతో మీట్‌ది ప్రెస్ కార్యక్రమంలో ఓ జర్నలిస్టు కీసర తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి చెక్కు కోసం లబ్ధిదారుల నుంచి రూ.6వేలు లంచం అడిగాడని ప్రశ్నించగా సీఎం రేవంత్‌రెడ్డి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు. దీనిపై కీసర తహసీల్దార్ ఆంధ్రజ్యోతి ప్రతినిధి వివరణ కోరగా తహసీల్దార్ కార్యాలయంలో ఎలాంటి పనికైనా లంచాలు డిమాండ్ చేసినా, అవినీతికి పాల్పడినా చర్యలు తీసుకుంటామన్నారు. కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో లంచం అడిగినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విచారణ చేపట్టి కలెక్టర్‌కు సమగ్ర నివేదిక అందజేస్తామని చెప్పారు.

ప్రధానిని కలిసిన బీజేపీ నాయకులు



ప్రధానిని కలిసిన అందె బాబయ్య

షాద్‌నగర్‌అర్బన్, మార్చి 17: ప్రధాని నరేంద్రమోదీని షాద్‌నగర్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ టి. విజయ్‌కుమార్ కలిశారు. నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన బీజేపీ సంకల్పసభకు తరలివెళ్లిన బీజేపీ నాయకులు మోదీని కలిసి కలిశారు. అదేవిధంగా షాద్‌నగర్‌కు చెందిన సీనియర్ న్యాయవాది మోముల బసప్ప బీజేపీలో చేరారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ అధ్యక్షుడు నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హోటల్ కత్రియాలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బీజేపీ కండువా కప్పి ఆయనను పార్టీలో చేర్చుకున్నారు.

ఫిషరీస్ కోఆపరేటీవ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్‌ను కలిసిన మత్స్య సంఘం నాయకులు



సాయికుమార్‌ను అభినందిస్తున్న నాయకులు

కేశంపేట, మార్చి 17 : ఫిషరీస్ కోఆపరేటీవ్ సొసైటీస్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా నియామకమైన మెట్టు సాయి కుమార్‌ను మత్స్య సంఘం కేశంపేట మండల నాయకులు ఆదివారం హైదారాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి సత్కరించారు. కార్యక్రమంలో ఫిషరీస్ కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు తుమ్మల గోపాల్ ముదిరాజ్, గంగన మోని సత్తయ్య, మంకాల శ్రీశైలం, అంజియాదవ్, నర్సింహా, రాజశేఖర్, అంజనాద్రి, విజయ్ పాల్గొన్నారు.

పట్టణ మౌలిక సదుపాయాల ఆర్థిక సంస్థ రాష్ట్ర చైర్మన్‌ను కలిసిన నాయకులు



నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కందుకూరు, మార్చి 17 : పట్టణ మౌలిక సదుపాయాల ఆర్థిక సంస్థ రాష్ట్ర చైర్మన్‌గా నియమితులైన చల్లా నర్సింహారెడ్డిని ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల కో-ఆర్డినేటర్ ఎండి అఫ్జల్‌బేగ్, నాయకులు పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీ అధిష్ఠానం ఎల్లప్పుడూ గుర్తింపునిస్తుందన్నారు. తనకు రెండు దఫాలుగా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు ఇచ్చిందని, తన వంతుగా జిల్లాలో అభ్యున్నతితో పాటు ప్రజల శ్రేయస్సు కోసం పనిచేశానని గుర్తు చేశారు. కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించిన పార్టీ అధిష్ఠానానికి, సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు డిల్లీ శ్రీధర్, బుక్క పాండురంగారెడ్డి, వత్సుల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : పట్టణ మౌలిక సదుపాయాల ఆర్థిక సంస్థ రాష్ట్ర చైర్మన్‌గా నియమితులైన చల్లా నర్సింహారెడ్డిని ఆదివారం ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్ మర్యాద పూర్వకంగా హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దశాబ్దాల కాలంగా కాంగ్రెస్ పార్టీకి అందించిన సేవలకు ఆయనకు రాష్ట్ర స్థాయిలో సముచిత స్థానం లభించిందని వారు చెప్పారు. రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ జగన్ నాయక్, బాల్‌రాజ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాంరెడ్డికి అభినందనలు తెలిపిన నాయకులు



అభినందనలు తెలుపుతున్న నాయకులు

ఇబ్రహీంపట్నం, మార్చి 17: కాంగ్రెస్ సీనియర్ నేత, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సోదరుడు మల్‌రెడ్డి రాంరెడ్డిని తెలంగాణ రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించడంతో ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో కలిసి కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలిపారు. ఆయనకు అవకాశం కల్పించడం పట్ల ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- సెంటర్ల వద్ద 144 సెక్షన్

ఆమనగల్లు, మార్చి 17 : పదోతరగతి వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశామని, పకడ్బందీగా పరీక్షల నిర్వాహణకు అన్ని చర్యలు చేపడుతున్నామని మండల విద్యాధికారి సర్దార్‌నాయక్ ఆదివారం చెప్పారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో 10 పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, 93 మంది ఇన్విజిలేటర్లను, పరీక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెట్లు, డీఓలను నియమించామని చెప్పారు. వీటిలో 1,924 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. సమయానికి గంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి ఎస్సైలు బాల్‌రామ్ నాయక్, వరప్రసాద్, శ్రీకాంత్ తెలిపారు.

ఇబ్రహీంపట్నం : నేటి నుంచి జరుగబోయే పదో తరగతి పరీక్షలకు విద్యాశాఖ అధికారులు



ఆమనగల్లు : ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఈవో

అన్ని ఏర్పాట్లు చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి 5,790 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఎంఈవో కె.వెంకట్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం 28 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మండలాల వారీగా ఇబ్రహీంపట్నం 2,320, యాచారం 887, మంచాల 523, అబ్దుల్లాపూర్‌మెట్ 2,060 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. 11 సెంటర్లు ఏర్పాటు చేశారు.

చేవెళ్ల : పదోతరగతి పరీక్షల కోసం చేవెళ్ల మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఇన్‌చార్జి ఎంఈవో అక్బర్ తెలిపారు. మండలంలో ఐదు సెంటర్లలో పరీక్షలు జరుగుతాయని, 800 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారని చెప్పారు.

మహేశ్వరం : పదోతరగతి పరీక్షల కోసం మహేశ్వరం మండలంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎక్కడా మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చర్యలు చేపట్టారు. 9 పరీక్షా కేంద్రాల్లో 280 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారని ఎంఈవో కృష్ణ తెలిపారు.

నిర్భయంగా పరీక్షలు రాయాలి : జడ్పీచైర్‌పర్సన్



అనితాహరినాథ్‌రెడ్డి

జిల్లాలో పదోతరగతి పరీక్షలు రాసే విద్యార్థులందరూ నిర్భయంగా పరీక్షలు రాయాలని జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి అన్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి తొందరపాటుకు గురికావొద్దన్నారు. పది పరీక్షలే భవిష్యత్తుకు దారి చూపేవని, విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలిని ఆమె సూచించారు.

వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

- నేటి నుంచి అన్మాస్‌పల్లి వీరాజంనేయ క్షేత్రంలో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు
- మంత్రులు, ఆధ్యాత్మిక గురువుల రాక

ఆమనగల్లు, మార్చి 17 : ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. బ్రహ్మోత్సవాల రెండోరోజు ఆదివారం ఆలయ ప్రధాన అర్చకుడు, నిర్వాహకుడు గూడ కృష్ణమాచార్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమంలో భక్తులు భారీగా హాజరయ్యారు. సోమవారం స్వామి వారి కల్యాణం నేపథ్యంలో ఆలయం వద్ద విశాల వసతుల ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అర్చకులు నిహాల్, అనిల్‌కుమార్, వెంకటరమణాచారి, కృష్ణ చైతన్య, సంజిత్ పాండే, శ్రీకాంత్, నాయకులు మాండెం చంద్రశేఖర్, దేవేందర్ శెట్టి, రామకృష్ణ, పాల్గొన్నారు.

కడ్తాల్ : కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని శ్రీ రామేశ్వర వీరాంజనేయ క్షేత్రంలో నూతనంగా నిర్మించిన దేవాలయాలు విగ్రహప్రతిష్ఠకు సిద్ధమయ్యాయి. నేటి (సోమవారం) నుంచి 20 వరకు కొనసాగే ప్రతిష్ఠాపన వేడుకలకు నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. వీరాంజనేయ క్షేత్రాన్ని శోభాయమానంగా తీర్చి దిద్దారు. అన్మాస్‌పల్లి గ్రామానికిచెందిన కోర్పోలు లక్ష్మారెడ్డి, కోర్పోలు కృష్ణారెడ్డి, కోర్పోలు విజయభాస్కర్‌రెడ్డి సహా అన్మాస్‌పల్లి భక్త బృందం సహకారంతో రూ.3 కోట్లతో శ్రీరామేశ్వర వీరాంజనేయ క్షేత్రంలో సీతారాములు, శివపార్వతులు, సర్వతి దేవి ఆలయాలను నిర్మించారు. కార్యక్రమానికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎంపీ పోతు



నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయం

గంటి రాములు, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, కలెక్టర్ శశాంక, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరవుతారని నిర్వాహకులు కోర్పోలు లక్ష్మారెడ్డి, మెట్లూరి వెంకటేశ్వరశర్మ, తెలిపారు. ఆధ్యాత్మిక గురువులు మాడ్గుల నాగఫణిశర్మ, శ్రీనాథశర్మ, సాధ్వి నిర్మలానంద భారతి మాతాజీ, సహా పలువురు, ప్రముఖ సినీ నటుడు సుమన్ పాల్గొంటారని చెప్పారు.

కడ్తాల్ : మండల పరిధిలోని చరికొండ శ్రీ వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం లంకాదహనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీటీసీ అద్దాల రాములు, మాజీ సర్పంచ్‌లు నర్సింహ్మా గౌడ్, లక్ష్మయ్య, భారతమ్మ, మాజీ జడ్పీటీసీ లక్ష్మమ్మ, అర్చకులు వేణుఆచార్యులు, రామాచార్యులు, కృష్ణమాచార్యులు, కిరణ్‌ఆచార్యులు, పాల్గొన్నారు.

రావిచేడ్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు మార్చి 19 నుంచి 23 వరకు కొనసాగనున్నాయి. రావిచేడ్ తో పాటు కడ్తాల్, తలకొండపల్లి , ఆమనగల్లు, కేశం పేట, కందుకూరు ,మహేశ్వరం నుంచి బ్రహ్మోత్సవాలకు భక్తుల రాక నేపథ్యంలో ఆలయ నిర్వాహకులు విశాల వసతులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రముఖ అర్చకుడు వింజమూరి రామానుజాచార్యులు పర్యవేక్షణలో ఉత్సవాలు కొనసాగుతాయి. బ్రహ్మోత్సవాల వివరాలను ఎంపీటీసీ బోప్పిడి గోపాల్, ఆలయ దర్మకర్త పుట్టపాగ రామచందర్‌రావు, మాజీ సర్పంచ్ భారతమ్మవిఠలయ్య గౌడ్ , అర్చకులు ఆచార్య ఆదిత్య, చిదంబర శర్మ, శిరీష్ కుమార్ లు వివరించారు. 19 నుంచి 23 వరకు ప్రత్యేక పూజలుంటాయని చెప్పారు.



ఆమనగల్లు : స్వామి వారి ఎదుర్కోళ్లలో భక్తులు

జ్ఞానంతోనే సమాజ చైతన్యం

ఆమనగల్లు , మార్చి 17: జ్ఞానంతోనే సమాజ చైతన్యం సాధ్యమని బహుజన సంఘాల నాయకులు బొల్లి గణేశ్, ఈర్లపల్లి ప్రవీణ్‌కుమార్ అన్నారు. జ్ఞాన సమాజ నిర్మాణం దిశగా బహుజనులంతా ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం అంబేద్కర్ జ్ఞాన ప్రచార సభ ఆధ్వర్యంలో మహనీయుల జీవిత చరిత్రపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ, సామాజిక రంగాల్లో దళిత, బహుజనులు మరింత రాణించాలని చెప్పారు. అంబేద్కర్ చూపిన మార్గం అందరికీ అనుసరణీయమన్నారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే జ్ఞానం అవసరమని, అది విద్య ద్వారానే సాధ్యమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జంతుక శంకర్, నాయకులు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి అయిల్ల పరామర్శ

ఆమనగల్లు, మార్చి 17 : కల్వకుర్తి పట్టణానికి చెందిన పోలీస్ అధికారి అశోక్ సతీమణి హిమబిందు ఇటీవల ఆకస్మికంగా మృతి చెందగా టీపీసీసీ సభ్యుడు అయిల్ల శ్రీనివాస్‌గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అశోక్ నివాసంలో జరిగిన ఆమె సంస్మరణ కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని సానుభూతిని తెలియజేశారు. పరామర్శించిన వారిలో మాజీ జడ్పీటీసీ బాలస్వామిగౌడ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, తదితరులు ఉన్నారు.

ఎన్నికల నిబంధలను ఉల్లంఘిస్తే చర్యలు

చేవెళ్ల, మార్చి 17 : ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని చేవెళ్ల ఆర్డీవో సాయిరాం అన్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఆదివారం రంగారెడ్డి జిల్లా బార్డర్ చెక్ పోస్టును చేవెళ్ల మండల పరిధిలోని అంతారం స్టేజీ వద్ద ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వచ్చి పోయే వాహనాలను పోలీసులు ఏవిధంగా తనిఖీ చేస్తున్నారో ఆర్డీవో పరిశీలించి, వారికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడదల కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. వికారాబాద్ జిల్లా నుంచి చేవెళ్లకు వచ్చే వాహనాలు, చేవెళ్ల మీదుగా వికారాబాద్ జిల్లాకు వెళ్లే ప్రతి వాహనాన్ని ప్రతీ రోజు పోలీసులు తనిఖీ చేస్తారని చెప్పారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. చేవెళ్ల తహసీల్దార్ బి. కృష్ణయ్య, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న ఆర్డీవో

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్యకర్తలు

ఇబ్రహీంపట్నం, మార్చి 17 : ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పోల్కంపల్లి ప్యాక్స్ వైస్ చైర్మన్ వేముల లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో వారు ఎమ్మెల్యేను కలిశారు. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వారు ప్రకటించారు.



మల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు


బీజేరెడ్డి సేవలు మరువలేనివి



బీజేరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్మికులు

షాద్‌నగర్‌అర్బన్, మార్చి 17: నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకుడిగా బీజేరెడ్డి చేసిన సేవలు మరువలేనివని ఆర్టీసీ కార్మికులు కొనియాడారు. రోడ్డు ప్రమాదంలో శనివారం దుర్మరణం చెందిన బీజేరెడ్డి(75)కి కార్మికులు నివాళులర్పించారు. షాద్‌నగర్ డిపో ఆవరణలో ఆదివారం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. 30 ఏళ్లపాటు కార్మిక నాయకుడిగా వారికి ఏ కష్టం వచ్చినా అండగా నిలిచారని, ముఖ్యంగా ఆర్టీసీ కాలనీని ఏర్పాటు చేసి, కార్మికులకు ఇండ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేశారని గుర్తు చేశారు. తోటి కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం నిస్వార్థంగా సేవ చేసిన బీజేరెడ్డి మరణించడం బాధకరమని అన్నారు.

స్నేహితుడి కుటుంబానికి అండగా..



ఎల్ఐసీ బాండ్‌ను అందిస్తున్న మిత్రులు

కేశంపేట, మార్చి 17 : తమతో కలిసి చదువుకుని అకాల మరణం చెందిన స్నేహితుని కుటుంబానికి మిత్రులు అండగా నిలిచారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామానికి చెందిన శ్రీశైలం ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అతని (1999-2000బ్యాచ్) పదోతరగతి మిత్రులు మృతుడి కుటుంబానికి అండగా నిలిచారు. శ్రీశైలం కుమారులపై రూ. 80,551 ఎల్ఐసీ బాండ్ తీశారు. దానితో పాటు రూ. 5వేలు నగదును ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో న్యాయవాది భాస్కర్, నందు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

యువకుడు అదృశ్యం

శంషాబాద్ రూరల్, మార్చి 17 : తండ్రి మందలించడని ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన ఆదివారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పనపర్తి జిల్లా కొత్తకోట మండల అమ్మాపూర్ గ్రామానికి చెందిన అరేపల్లి సుబ్రమణ్యం కుటుంబ సభ్యులు కొన్ని సంవత్సరాలుగా మున్సిపల్ పరిధిలోని ఊట్‌పల్లిలో నివాసం ఉంటున్నారు. సుబ్రమణ్యం కుమారుడు అరేపల్లి వినోద్(18) ఫిబ్రవరి 27న కొత్త పల్సర్ బైకు కొనుగోలు చేశాడు. బైకు ఎలా కొన్నావు అని తండ్రి మందలించడంతో ఇంట్లో ఎవరికి చెప్పకుండా వినోద్ వెళ్లిపోయ్యాడు. బంధువులు, స్నేహితుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యువకుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఎక్కుతుండగా.. బంగారు గొలుసు చోరీ

చేవెళ్ల, మార్చి 17 : బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ఓ మహిళ హ్యాండ్ బ్యాగులోంచి గుర్తు తెలియని దుండగులు బంగారు గొలుసు చోరీ చేసిన సంఘటన చేవెళ్ల ఆర్టీసీ బస్టాండ్‌లో జరిగింది. చేవెళ్ల ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని వీరభద్రకాలనీకి చెందిన స్వప్న అనే మహిళ శనివారం మధ్యాహ్నం పుట్టింటికి శంకర్‌పల్లికి వెళ్లేందుకు చేవెళ్ల బస్టాండ్‌కు వచ్చింది. బస్సు ఎక్కుతున్న సమయంలో చేతిలో ఉన్న హ్యాండ్‌బ్యాగులోంచి బంగారు నల్లపూసల గొలుసు, చెవి కమ్మలు, కొంత నగదును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బస్సులో కూర్చున్నాక బ్యాగ్ జిప్ తీసి ఉండడంతో అనుమానం వచ్చి చూడగా అందులోని గొలుసు, కమ్మలు కనిపించలేదు. వెంటనే బస్సు దిగి చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్ల ఎస్సై ప్రదీప్‌కుమార్ చెప్పారు.

ఐకమత్యంతోనే గ్రామాల అభివృద్ధి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్‌రూరల్, మార్చి 17 : రాజకీయాలకు అతీతంగా ఐకమత్యంతో పని చేస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్ నాయకుడు భరత్‌సింహారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే శంకర్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో అందరికీ సమన్యాయం జరుగుతుందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ ఎంపీగా పోటీ చేస్తున్న వంశీచందరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, అంజన్‌రెడ్డి, మాధవరెడ్డి, రఘుపతిరెడ్డి, గణేష్‌నాయక్, తిక్కన్న ఉన్నారు.

బీటీ రోడ్డు పనుల పూర్తికి మంత్రి హామీ



మంత్రి కోమటిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రమణారెడ్డి

ఆమనగల్లు, మార్చి 17 : ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లి నుంచి మాడ్గుల మండలం చంద్రాయన్‌పల్లి వరకు నిలిచిపోయిన బీటీ రోడ్డు నిర్మాణం పనులను వెంటనే పూర్తి చేయించాలని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కల్లు వెంకటరమణారెడ్డి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డిని కోరారు. 17 కిలోమీటర్ల అసంపూర్తి రోడ్డును డబుల్‌రోడ్డుగా నిర్మించడం కోసం రూ.30 కోట్లు నిధులు విడుదల చేయాలని ఆయనకు వినతిపత్రం ఇచ్చారు. ఆదివారం ఈ మేరకు హైదరాబాద్‌లోని మంత్రి వెంకట్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పదేళ్లుగా ఈ రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయిందని, దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రమణారెడ్డి మంత్రికి చెప్పారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి పార్లమెంట్ ఎన్నికలు పూర్తికాగానే అసంపూర్తిగా ఉన్న బీటీరోడ్డు పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చినట్లు రమణారెడ్డి తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు సంజీవరెడ్డి, పరుశరాంరెడ్డి, తదితరులు ఉన్నారు.

విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల అభివృద్ధికి కృషి



చింతపట్ల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

యాచారం, మార్చి 17 : తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల పురోభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని యాచారం మండలంలోని చింతపట్ల ఉన్నత పాఠశాలకు చెందిన 2011-12 బ్యాచ్ పదోతరగతి పూర్వవిద్యార్థులు అన్నారు. ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. తమకు చదువు చెప్పిన ఆనాటి గురువులు వేదశ్రీ, యాదగిరిరెడ్డి, మల్లేశం, వెంకటేశంను వారు ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందించారు. నాటి విద్యార్థులు రమేష్, శ్రీను, వెంకటేష్, ప్రవీణ్, మోహన్ తదితరులు కలిసి పాఠశాల అభివృద్ధి పనులకు రూ.5వేల నగదును పీఈటీ సాబేర్‌కు అందించారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

కేశంపేట, మార్చి 17: షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన క్రికెట్ టోర్నీ ఆదివారం ముగిసింది. ఫైనల్‌లో సన్‌రైజర్స్, ముంబాయి ఇండియన్స్ టీంలు పోటీ పడగా సన్‌రైజర్స్ టీం విజయం సాధించింది. రన్నర్‌గా ముంబాయిఇండియన్స్ టీం నిలిచింది. నిర్వాహకులు విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గూడ వీరేష్, అంజనేయులు, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ మార్గం అనుసరణీయం

తలకొండపల్లి , మార్చి 17 : అంబేద్కర్ అనుసరించిన మార్గం, ఆలోచనలు అందరికీ అనుసరణీయమని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. ఆయన కలలు గన్న సమాజ నిర్మాణం కోసం అందరూ కృషి చేయాలని ఆయన కోరారు. తలకొండపల్లి మండలం చంద్రధన గ్రామంలో ఈనెల 26న నిర్వహించబోయే అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆదివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా ఎస్సై హాజరై స్థానిక నాయకులతో కలిసి వాటిని ఆవిష్కరించారు. రాజ్యాంగ ఫలాలు పేదలకు అందినప్పుడే అంబేద్కర్‌కు అసలైన నివాళి అని అంబేద్కర్ జాతర కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ, మాజీ సర్పంచ్ లలిత జ్యోతయ్య అన్నారు. కార్యక్రమంలో నాయకులు దరువుల రామచంద్రయ్య, పోతుగంటి కుమార్, కిరణ్, యాదయ్య, వెంకటేశ్, శ్రీను, గణేశ్, పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్సై, తదితరులు

ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

పరిగి, మార్చి 17: ఈనెల 19 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న పరిగిలోని శ్రీలక్ష్మీనర్సింహ్మాస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆదివారం పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పరిశీలించారు. యజ్ఞాల కోసం ఏర్పాటు చేసిన గుండాలను పరిశీలించారు. ఈ సమావేశంలో పరిగి మాజీ సర్పంచ్ సిద్ధాంతి పార్థసారథి, మాజీ జడ్పీటీసీ ఎస్‌పి బాబయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, కార్యదర్శి కడ్మూరు ఆనందం, నాయకులు పి.చిన్ననర్సింహులు, అంజనేయులు పాల్గొన్నారు.

వీరశైవ భవనం నిర్మించాలి

వీరశైవలింగాయత్ సంఘం నాయకులు ఆదివారం పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి,రామ్మోహన్‌రెడ్డిని కలిశారు. వీరశైవలింగాయత్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం వీరశైవ భవనం నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు. అందుకు స్థలం కేటాయించి, నిధులు మంజూరు చేయించాలని కోరారు.